

# చరిత్రలో ఓ పుట

**- కాకాని చక్రపాణి**

***"తరుణి దీర్ఘ కేశములు సౌందర్య ఖనులు***
***వెలసినవి నేడు నన్నురి పెట్టుకొరకు"***
***"కత్తి చేత లేక కదనమ్ము జరిపెడి***
***ఇంతికెవ్వడసువు లీయకుండు."***
***"ఎంత తీయని పెదవులే ఇంతి! నీవి***
***తిట్టుచున్నపుడు కూడ తీపి కురియు"***

గాలిబ్ గీతాలను (అను: దాశరథి) స్మరణకు తెచ్చుకుంటూ ప్రణయ లోకంలో విహరిస్తున్న నవాబు మహమ్మద్ అన్వరుద్దీన్ బహదూర్ వారికి "హుజూర్" అని సేవకుడు పిలిచిన పిలుపు నాకాన్నుండి ఇహానికి త్రోసినట్లయింది. అది ప్రభువుగారి ఏకాంత మందిరం. అందులో ఎవరికీ ప్రవేశం లేదు, సేవకుడు ఒక్క అలీముద్దీనుకు తప్ప. నాలుక పీకి వేసింది నవాబుకు. చషకంలో మధువు నిండుకుంది.

"నువ్వు నోరు తెరిచావంటే మాటలకు అంతుండదు. ముందు పాన పాత్ర నింపు."

అలీముద్దీన్ చషకంలో మధువు నింపాడు. నవాబు ఓ గుక్క తాగి గొంతు తడుపుకున్నాడు.

"బావుందిరా, మదిర! ఆపాత 'కలాల్' (ఆసవకారుడు) వెధవ ఎవడూ? వాడిని మార్చెయ్. ఈ కొత్తవాడినే మనకు మధువును సరఫరా చెయ్యమని చెప్పు."

"జీ, హుజూర్!" అన్నాడు అలీముద్దీన్.

"ఏదో చెప్పబోయాడు...?"

"తమ గులామును. తమ తండ్రిగారి కాలంనుండి ప్రభువుల పాదాల దగ్గర పడి బతుకుతున్న తుచ్ఛ జీవిని. ఓమాట మీరి వాగినా మన్నించే ప్రభువులు తమరు..."

"ఎందుకురా, ఈ ఉపోద్ఘాతం? చెప్పి తగలడు..."

"సర్కారువారి 'మదరుల్ మహమ్' (ఆర్థికశాఖ నిర్వహణాధికారి) చనిపోయి ఏడాది దాటిపోయింది. అమీరు జఫ్రుల్లాఖాన్ ఇంటికి రెండేళ్ళ క్రితం ఇరాన్ నుండి వారి బంధువు ఒకాయన వచ్చాడు, ప్రభువువారి కొలువులో చేరాలని. జఫ్రుల్లాఖాన్ బహదరువారు దివానువారికి ఆయన్ని పరిచయం చేశారు. ఆయన పేరు నవాబ్‌ఖాన్. దివాను ప్రభువులకు ఆయన విషయం నివేదిస్తానంటూనే తాత్సారం చేస్తున్నారు..."

నవాబుకు అలీముద్దీన్ మాటల సారాంశం అర్థమైంది. దివానంటే ఆయనకు మంట! త్రాష్టుడు, బ్రిటీషు తొత్తుల తొత్తు!'

"జఫ్రుల్లాఖాన్ బహదరువారు తమకు విశ్వసనీయులు..."

నవాబు కనుబొమలు ముడివడ్డాయి.

"సరే, ఇందులో నీ ఆసక్తి ఏమిటిరా? సిఫారసులు చేసే స్థాయికి ఎదిగావా?" అన్నాడు కరుకుగా.

"తౌబ తౌబ!" అన్నాడు అలీముద్దీన్, ఖాళీ అయిన పానపాత్ర నింపుతూ. "హుజూరువారు మన్నించాలి. దేవుడి మీద ఒట్టు! నాకిందులో ఏ ఆసక్తిలేదు. ప్రభువులు మాట్లాడొద్దంటే నోరు మూసుకుంటాను."

నవాబు గద్దించాడని అలీముద్దీన్ భయపడలేదు. భయపడ్డట్టు నటించాడు. ఆ వంశ ప్రభువుల ప్రవృత్తిని కాచి వడబోసిన వాడతను.

"సరే, సరే... చెప్పి ఏడువు."

"నవాజ్‌ఖాన్ పెద్ద కుటుంబీకుడు. ఆయన కూతురు నాదిరా బేగం అతిలోక సౌందర్యవతి అని నా భార్య చెప్పింది. ఇరాన్ సుందరుల గురించి తమకు తెలియంది కాదు."

"ఎన్నేళ్ళు? మన జనానాకు తగినదేనా?"

"ఇరవయ్యేళ్ళలోపే. నిఖా చెయ్యాలని చూస్తున్నాడు. తగిన వరుడు లభ్యమవలేదు. జహంగీరు పాదుషావారి నూర్జహాన్ బేగమ్ కూడా ఆ పిల్ల ముందు దిగదుడుపేనని నా భార్య చెప్పింది."

"జహంగీరు పాదుషావారి బేగమ్‌ను నీ పెళ్ళాం చూసిందేమిత్రా?" అని నవ్వాడు నవాబు.

"ఆమె పోయి ఏళ్ళు గడిచాయి. అలాంటి అదృష్టమా? చెప్పుకుంటారు కదా!"

"అవును. నిజమే."

ఆ తర్వాత అలీముద్దీన్ మరి మాట్లాడలేదు. మరీ సాగదీస్తే అందులో తన స్వార్థప్రయోజనముందని నవాబు శంకించే ప్రమాదముంది. బీజావాపనం జరిగాక అంకురం తలెత్తటానికి కొంత సమయం పడుతుందని అతనికి తెలుసు. అంతకుముందు అమీరు జఫ్రుల్లా నవాబును ఈ విషయంలో అర్థించకపోలేదు. విని మిన్నకుండి పోయాడు నవాబు. జఫ్రుల్లా అఖండుడు. పెద్దవాళ్ళతో కానివి చిన్నవాళ్ళతో సాధించవచ్చు. నిత్యం వెంటుండే సేవకుడితో కాని పనులుండవు. అదీ పరదేశీయుల అధికారానికి తలొగ్గి మదవతి, మధుసేవనంలో గడిపే నిష్క్రియులైన నవాబులకు సేవకులతోనే సాంగత్యం అధికం. అందుకే అలీముద్దీన్‌కు అష్రఫీల ఆశచూపాడు. కామినీ కాంచనాలకు దాసోహం కాని వాడెవడు! నవాబూ, గులామూ ఆ కోవలోని మనుషులే. అష్రఫీల ఆశతోనే ఈ ప్రస్తావన చేశాడు అలీముద్దీన్.

అంతలో దౌవ్వారికుడు లోపలకు ప్రవేశించాడు. అలీముద్దీన్ చెవిలో ఏదో చెప్పాడు. అతన్ని పంపేసి, "సర్కారువారి దర్శనార్థం దివాను బహద్దరువారు వేంచేసినారంట. జరూరు పనంట. ప్రభువుల అనుమతి అయితే..." విన్నవించుకున్నాడు సేవకుడు.

"పనీపాటా లేదా ఆయనకి, పొద్దున్నే తగలడ్డాడు" అని విసుక్కున్నాడు నవాబు, మరో గుక్క మధువు పుచ్చుకుంటూ.

"మధ్యాహ్నం మూడు గంటలయింది, హుజూర్!"

"ఛప్! రాత్రి గానాబజానాలయి ఎప్పుడో పొద్దున నాలుగ్గంటలకు నిద్ర పట్టింది. అదీ ఓ గోలీ నల్లమందు వేసుకుంటే. ఇప్పుడు కుదరదని చెప్పు..."

"ఎప్పుడు ప్రభువులకు వీలవుతుందని చెప్పమంటారు?"

"ఓ వారం రోజుల తర్వాత రమ్మను చూద్దాం."

"జీ, హుజూర్!"

బయటికి వెళ్ళిన అలీముద్దీన్ గోడకు కొట్టిన బంతిలా తిరిగి వచ్చాడు.

"పూసీ నది పొంగి పొరలుతున్నదంట! వారం రోజులబట్టీ ఒకటే వాన! గొడ్డూగోదా కొట్టుకుపోతున్నాయి. జనం చచ్చిపోతున్నారంట! శరణార్థుల శిబిరాలు తెరవాలంట, సహాయక చర్యలు చేపట్టాలంట! కర్చుతో కూడుకున్న పని. ప్రభువుల హుకుం తీసుకోటానికి వచ్చారు దివాను."

"ఛత్! వానాకాలంలో నదులు పొంగవంట్రా? వరద ముంపోస్తే జనాలు చావరా? అంత చిన్న విషయానికి మా ఏకాంతాన్ని భగ్నం చేయాల్నా? సహాయ కార్యక్రమాలంటే డబ్బు కావాలి. డబ్బెక్కడుంది? ఖజానా ఖాళీ! మొన్న జనానాలోకి కొత్తగా తెచ్చుకున్న ఆడదాని భవంతి నిర్మాణానికే పది లక్షలు ఖర్చయినాయి. డబ్బు లేదని చెప్పి ఆ పని పూర్తిచెయ్యనివ్వలేదు దివాను. మళ్ళా ఏ ముఖం పెట్టుకు వచ్చాడు. వెళ్ళు. మళ్ళా ఈ విషయంలో నావద్దకు రావద్దని చెప్పు" అని హుకుం జారీచేశాడు నవాబు.

అలీముద్దీన్ దివానును చంపేసి హుజూరివారి సేవకు తిరిగి వచ్చాడు.

"చెప్పినా! జనంలో నిరసన ప్రారంభమవుతుంది. ప్రభువులను తిట్టుకుంటారన్నాడు. 'ఖజానాలో డబ్బు లేకుంటే ప్రభువులేం చేస్తారు. షావుకారులు, ధనవంతుల నుండి విరాళాలు పోగుచేసి జనాలకు చెయ్యాల్సింది చెయ్యి. ప్రభువులు అంతకంటే జరూరు పనిలో నిమగ్నమై ఉండినారని చెప్పినా.

"శహభాష్! ఒరే, నీమాత్రం తెలివితేటల్లేవురా, ఆ దివానుగాడికి! వాడి పదవి ఊడబెరికి నిన్ను దివానును చేస్తాను."

"వద్దు, హుజూర్! ప్రభువుల సేవే నాకు స్వర్గం. తమ కాళ్ళకాడే నాకు మోక్షం. అల్లా తమకు సుదీర్ఘమైన ఆయుష్షు ప్రసాదించాలి."

"అదేం మాటరా! నీకున్న తెలివితేటలు ఆ దివానుకు లేవు. వరదల్లోస్తే నా దగ్గరకు రావాలా? నువ్వు సమస్యను క్షణంలో పరిష్కరించావు. దివానన్న వాడికి కావల్సిన లక్షణమదే. ఈ దివానుకు సమయం, సందర్భం లేవు. ఆ సమయంలో జరూరు పని అంటూ తగలడతాడు. నీ అంత నమ్మకస్తుడు నాకెవడున్నాడు? పైగా నువ్వు మంచి వాడివి! అంతకంటే దివానుకేం అర్హతలుండాలి?"

అయితే, తన అధికారం పరిమితమని ఆయన బయటికి చెప్పలేదు. బ్రిటీషు వారికి నమ్మకస్తుడు దివాను. అతన్ని ఆ పదవి నుండి తొలగించటం తనవల్ల కాని పని. రెసిడెంటు ఊర్కోడు. గవర్నరు జనరల్‌కు రిపోర్టు చేస్తాడు. ఆ గవర్నరు జనరల్ అధికారానికి, అహంకారానికి అదుపే లేదు. హిందూస్థానమంతా తన జాగీరేనని భావిస్తాడు. అమీరు జప్రుల్లా చెప్పినప్పుడు ఆ నవాజ్‌ఖాన్‌ను కొలువులోకి తీసుకుందామనే తననుకున్నాడు. కానీ, అందుకు బ్రిటీషు రెసిడెంటు అనుమతి కావాలి. అతన్ని అడగటం ఇష్టంలేకే తనప్పుడు మిన్నకుండిపోయాడు. దివానులాంటి పెద్ద పదవి కాదు కనుక, తను పట్టుబడితే రెసిడెంటు కాదనకపోవచ్చు. ఆ పిల్ల అద్భుత సౌందర్యవతి అంటున్నాడు అలీముద్దీన్. అదే నిజమయితే, తను పట్టుబడక తప్పదు. అంత ఆలోచన చేసిన నవాబుకు అలసట అన్పించింది. చషకంలోని మదిరని ఒక్క గుక్కలో గొంతులోకి పంపేశాడు.

"అంతా పాదుషావారి దయ!"అన్నాడు అలీముద్దీన్, చషకాన్ని నింపుతూ.

"సర్లే, ఆ పిల్ల సంగతి చెప్పరా."

"ఆమె సౌందర్యాన్ని నాలాంటి నిర్భాగ్యుడేం వర్ణించగలడు! ఆమె చక్కగా పాడుతుందంట కూడాను. గాంధర్వగానమే"అంటూ ఓ షాయరీ విసిరాడు అలీముద్దీన్.

'ఆ గొంతు అగ్నిశిఖలా జ్వలిస్తుంది.
ఆ స్వరం వెలుగులు విరజిమ్ముతుంది'

"వహ్వా! ఎక్కడ నేర్చుకున్నావురా, ఇంత కవిత్వం!" అడిగాడు నవాబు తన్మయుడైపోతూ.

"ప్రభువుల సాంగత్యం. నిత్యం తమరి సేవ చేసుకునే వారికెవరికైనా షాయరీ అలవోకగా అలవడుతుంది. నేనగానెంత?"

"బావుందిరా! ఆ పిల్ల తండ్రికి కొత్వాలు పదవి ఇద్దాం."

"తమరి కృప ఉంటే కొత్వాలు పదవి ఏమిటి, 'మదురుల్ మహామ్' పదవే ఇవ్వవచ్చు. పైగా తమరా అమ్మాయిని చూశారట కూడా."

'నజర్'అనే అరబ్బీ పదానికి అర్థం 'దృష్టి' అని. ప్రభువును దర్శించుకున్నవారు తమ ప్రభుభక్తినీ, దర్శన మిచ్చినందుకు తమ కృతజ్ఞతను తెలియపర్చుకుంటూ ప్రభువుకు తమ 'నజరానా' (బహుమతి) సమర్పించుకోటం మొగలుల కాలం నుండి వస్తున్న ఆచారం. అలాంటి బహుమతి ప్రభుభక్తికి చిహ్నమే గానీ, ఇచ్చిన వ్యక్తికి ఆర్థికంగా నష్టం కలిగించేది గానీ, పుచ్చుకున్న వ్యక్తికి లాభం కలిగించేది గానీ అయి ఉండేది కాదు.

"ఎప్పుడూ?"

"అమీరు జప్రుల్లా వారి కొడుకు పెళ్ళిలో. ఆమె కూడా తమర్ని చూసి వెంటనే ప్రేమలో పడిపోయిందట! నా భార్య చెప్పింది"

అప్పుడు లీలగా గుర్తుకు వచ్చిందీ నవాబుకు. పరదాల మాటునుండి తను చూసిన ఇద్దాను సుందరి ఎవరా అనుకున్నాడు. వెంటనే తన జనానాకు తెచ్చుకుందామనుకున్నాడు కానీ, గొడవలవుతయ్యని ఊరుకున్నాడు. ఆ జప్రుల్లా మంచివాడే కానీ మూర్ఖుడు! అల్లరయితే పరువు పోతుంది.

"అలాంటి సుందరిని కన్నతండ్రికి ఏ పదవి అయినా ఇవ్వవచ్చు. అన్నట్టు ఆ పోయినవాడు రషీదుద్దీన్ కదూ? పెద్ద కుటుంబంలోని వాడని బ్రిటీషు రెసిడెంటు పట్టుబడితే వాడికా నౌకరీ ఇచ్చాను. దొంగ వెధవ నజరానా కూడా సమర్పించలేదు. మర్యాదా, మన్ననా తెలియని వాడు. శాఖను సమర్థవంతంగా నిర్వహించాడని ఆ తెల్లవాడంటే సరా! నాకు తెలియదూ, ఎవడి సత్తా ఎంతో?

"వంశపారంపర్యంగా వస్తున్న ప్రభువులు తమరు తమకు తెలియనిదే ముంటుంది? రాచ రక్తంలోనే ఉంటుంది ఆ శక్తి! దేవుడి అనుగ్రహం తమపై నిండుగా వుంది."

"నిజానికి నజరానాలు స్వీకరించటం నాకు సుతరామూ ఇష్టంలేదు. అయితే, ఎంతోకాలం నుండి వస్తున్న ఆచారం. ఇప్పుడు నేను కాదంటే జనాలు మనసు కష్టపెట్టుకుంటారు. అందుకే తప్పటం లేదు."

'నజర్'అనే అరబ్బీ పదానికి అర్థం 'దృష్టి' అని. ప్రభువును దర్శించుకున్నవారు తమ ప్రభుభక్తినీ, దర్శన మిచ్చినందుకు తమ కృతజ్ఞతను తెలియపర్చుకుంటూ ప్రభువుకు తమ 'నజరానా' (బహుమతి) సమర్పించుకోటం మొగలుల కాలంనుండి వస్తున్న ఆచారం. అలాంటి బహుమతి ప్రభుభక్తికి చిహ్నమే గానీ, ఇచ్చిన వ్యక్తికి ఆర్థికంగా నష్టం కలిగించేది గానీ, పుచ్చుకున్న వ్యక్తికి లాభం కలిగించేది గానీ అయి ఉండేది కాదు. దేవుడిని దర్శించుకోటానికి వెళ్ళినప్పుడు సమర్పించుకునే పత్రం, పుష్పం ఫలం, తోయం లాంటిదే ఇది. రాజు దైవాంశ సంభూతుడన్న భావన ఆ పాత కాలంలోనే ఉండేది కనుక అలాంటి ఆచారమేర్పడి ఉండవచ్చు. అయితే, కాలక్రమంలో ఆ ఆనవాయితీ వికృత రూపం సంతరించుకుంది. 'రాజు దృష్టిపడితే రాళ్ళు పగులుతాయి' అనే సామెత చందమయింది. ప్రభువులు ఆనవాయితీ పేరున నజరానాలు భారీగా దండుకోటం ప్రారంభమైంది. వచ్చే మొత్తాలనుబట్టి రాచకృప ప్రసరించటం మొదలయింది.

"అమ్మమ్మ! ప్రభువులు నజరానాలు స్వీకరించకపోతే జనం గగ్గోలు పెడతారు. ఈ నవాజ్‌ఖాన్ రషీదుద్దీన్ లాంటి మనిషి కాదు. ప్రభువులకు పదివేల అష్రఫీలయినా చదివించుకుంటాడు. మసీదులకూ భారీగా ముడుపులు ఇస్తుంటాడని నేను విన్నాను. అల్లాంటిది సాక్షాత్తూ ప్రవక్త వంశానికి చెందిన తమరిని దర్శించుకునేప్పుడు ఆయన సమర్పించుకునే నజరానా అమూల్యమే అయి ఉంటుంది."

"భేష్! మనిషి మంచివాడు, దైవ భక్తికలవాడు. అతను 'మదరుల్ మహామ్' పదవికి తగినవాడేననిపిస్తున్నది."

"అమ్మాయిని ప్రభువులు ఓసారి చూస్తే బావుంటుందేమో..."

"అక్కర్లేదురా. ఓసారి చూశాను. సౌందర్యవతి అని నీ భార్య చెప్పింది. సర్లే, ఆ పిల్ల పేరేందన్నావు? ఏదయితే నేంలే, మన జనానాకి వచ్చెయ్యాలి. రేపే ఆపనయిపోవాలి. రేపే ఆమె తండ్రికి 'మదురుల్ మహామ్' పదవి ఖరారు చేసేద్దాం. రాచ కార్యాలలో ఆలస్యం పనికిరాదు. అధికారి లేనప్పుడు ప్రభుత్వశాఖ అరాచకానికి ఆలవాలమవుతుంది. ప్రజలు ఎన్నో కష్టాలకు గురవుతారు"అన్నాడు నవాబు పాన పాత్రను ఖాళీచేస్తూ.

"ప్రభువుల దయ అపారం."

"నిద్ర వచ్చేటట్టుగా వుందిరా. జమీలాని పిలవనంపు. అది కాళ్ళు నొక్కుతుంటే హాయిగా కునుకు పడుతుంది."

"హుజూర్ బాగా అలసిపోయారు. ఇప్పుడే ఆమెను తీసుకు వస్తాను."

రాచకార్య నిర్వహణలో అలసిపోయిన నవాబు తల్పం చేరి మేను వాల్చాడు. జమీలా సుతి మెత్తని చేతుల్తో పాదాలు వత్తుతుంటే, అలీముద్దీన్ వీవనతో విసరుతుంటే నవాబు నిద్రలోకి జారుకున్నాడు.

నవాబు తలిస్తే కాకపోయేదేముంది? అన్నీ ఆయన కోరుకున్నట్టే జరిగాయని చెప్పాల్సిన పని లేదు.

చరిత్రలో ఇలాంటి నిరర్థకపు పుటలెన్నో!

★